
సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం ; 27 ; ఫిబ్రవరి ; 2024



28 నుంచి బ్రహ్మోత్సవాలు

మందసలో 28 నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. వాసుదేవ పెరుమాళ్ల ఆలయం ముస్తాబవుతోంది. - 8లో



టెట్‌కు ఏర్పాట్లు పూర్తి

ఉపాధ్యాయ అర్హత పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మార్చి 9 వరకు పరీక్షలు జరుగుతాయి. - 8లో

'సరిహద్దులో నేరాలు అరికట్టాలి'

శ్రీకాకుళం క్రైమ్ : అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో జరుగుతున్న నేరాలను రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పని చేసి అరికట్టాలని కలెక్టర్ డాక్టర్ మన్‌జీర్ జిలానీ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా కలెక్టర్ అంతర్రాష్ట్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి ఎస్పీ జీఆర్ రాధిక, అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్‌తో పాటు సరిహద్దు జిల్లాలైన గంజాం, గజపతి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సరిహద్దులో చేసిన భద్రతా ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు.

న్యూస్‌రీల్

చంద్రబాబూ ప్రేలాపనలు కట్టిపెట్టు



నరసన్నపేట: రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీరని ద్రోహం చేసిన టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రేలాపనలు కట్టిపెట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ హితవుపలికారు. రా.. కదలిరా.. కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళానికి సోమవారం వచ్చిన చంద్రబాబు ఇప్పుడు నీతి కబుర్లు చెబుతున్నారని, కానీ ఆయన మాటలు ఎవ్వరూ నమ్మబోరని, 2019లో పట్టిన గతే ఇప్పుడూ పడుతుందని పేర్కొన్నారు. ఆయన సోమవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ప్రభుత్వం నుంచి అందించాల్సిన పథకాలే కాకుండా ప్రజల కష్టార్జితాన్ని కూడా జన్మభూమి కమిటీల ద్వారా కాజేసిన చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఆరోపణలు చేస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌కు సంపద సృష్టించడం రాదు అని ఆరోపణలు చేసే చంద్రబాబు 2014–2019 ల మధ్య ఎంత సంపద సృష్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా రాకపోవడానికి కారణం చంద్రబాబే అని అన్నారు. 'ఆనాడు నీ కోటరీ మాటల నమ్మి ప్యాకేజీకి ఒప్పుకున్న నువ్వు ఆంధ్ర ద్రోహివి' అంటూ మండి పడ్డారు. టీడీపీ పాలనలో శ్రీకాకుళం అధోగతి పాలైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి వచ్చిన తర్వాతే జిల్లా అభివృద్ధి చెందిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులపై ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎల్లో మీడియా రాతలనే చంద్రబాబు పాడుతున్నారని, వాటిని నిరూపించగలరా అని సవాల్ విసిరారు. జిల్లా ప్రజలు తెలివైన వారని, మీ మాయ మాటలు నమ్మరని పేర్కొన్నారు.

రైలు టికెట్ ధరలు తగ్గాయ్..



ఆమదాలవలస: సామాన్యులకు అందుబాటులో ఉండేలా పాసింజరు రైలు టికెట్ ధరలు తగ్గించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ నుంచి విశాఖ, అటు పలాసకు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. డీఎంయూ రైలు (08531) పలాస –విశాఖపట్టణం, ఈఎంయూ రైలు (07470) పలాస– విశాఖపట్టణంకు టికెట్ ధరలు తగ్గించారు. శ్రీకాకుళం నుంచి విశాఖకు గతంలో టికెట్ ధర రూ.60 ఉండేది. అది ప్రస్తుతం రూ.30లు చేశారు. అలాగే శ్రీకాకుళం నుంచి పలాసకు రూ. 40 సాధారణ టికెట్ ఉండేది. ప్రస్తుతం అది రూ. 20గా తగ్గిస్తూ ప్రకటించారు.

మార్చి 3న పల్స్ పోలియో



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మార్చి 3వ తేదీన పల్స్ పోలియో నిర్వహించనున్నామని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 3న, అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే 4, 5 తేదీల్లో కూడా వేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి సందేశం చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. 1,79,984 మంది ఐదేళ్ల లోపు పిల్లలకు 1232 పోలియో బూత్‌లు, 50 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 78 మొబైల్ టీమ్‌లు, 121 సూపర్‌వైజర్ బృందాలుగా ఏర్పడి 3,12,000 డోసులు వేయడానికి ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. మొబైల్ టీమ్‌లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అన్ని సంచార జాతుల వారి పిల్లలకు, ఇటుక బట్టీలు నిర్వహించే వారి పిల్లలకు, నిర్మాణ స్థలాలు, ఫిషరీస్ ప్రదేశాల్లో పోలియో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఈశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ విద్యాసాగర్, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, రవాణా, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కరపత్రం ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఆర్థిక అక్షరాస్యత వారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, బ్యానర్లను కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లు సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు.

కట్టుకథలతో రుబాబు



- శ్రీకాకుళం సభలో గుక్క తిప్పుకోకుండా అబద్ధాలు వల్లెవేసిన చంద్రబాబు
- అధికారంలో ఉన్నప్పుడు మాటిచ్చి మోసం చేసిన వైనం
- జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు విస్మరించి విమర్శలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జనం నమ్ముతారో లేదో అన్న సోయి లేకుండా కట్టుకథలు అల్లడం, వారిని ఎలాగైనా నమ్మించి తీరాలని అబద్ధాలు చెప్పడం, కళ్ల ముందు కనిపిస్తున్న పనులు చూడకుండా బురద జల్లడం.. శ్రీకాకుళంలో సోమవారం నిర్వహించిన రా కదలిరా సభలో చంద్రబాబు ప్రసంగం సాగిన తీరు ఇది. చంద్రబాబు 2014–19లోనే కాదు కాదు అంత కు ముందు పరిపాలించిన సమయంలో కూడా జిల్లా లో చేసిందేమీ లేదు. అవినీతిలో కూరుకుపోయారు. ఇవన్నీ మర్చిపోయి ఇప్పుడు మళ్లీ కొత్త హామీల పాట ఎత్తుకున్నారు. దీంతో జిల్లా వాసుల గత టీడీపీ దుర్మార్గ పాలనను గుర్తుతెచ్చుకుంటున్నారు.

టీడీపీ హయాంలో ఈ బాదుడు మాటేమిటి బాబూ..

జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి రాజ్యాంగ స్ఫూర్తిని నడివీధిలో నిలబెట్టి హత్య చేశారు. రాజకీయ రాక్షస మూకల్లా జనాలపై పడి పీల్చుకుతిన్నారు.

- 2015–16లో విద్యుత్ చార్జీలు పెంచారు. జిల్లాలో 8లక్షల మందికి నెలకి రూ.2కోట్లపైన భారం మోపారు.
- ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నాలుగు గంటల పాటు అప్రకటిత కోతలు విధించారు. అంతేకాదు ప్రతి సోమవారం పవర్ హాలీడే ప్రకటించారు. వాస్తవానికి అప్పట్లో దేశమంతా విద్యుత్ సమస్య లేదు.
- 2015లో ఆస్తి పన్ను కూడా పెంచారు. 20 శాతం నుంచి 150 శాతం వరకు పన్ను పెంపు చేశారు. ఒక్క శ్రీకాకుళంలోనే రూ.4.5కోట్ల మేర అదనపు భారం మోపారు. ఆమదాలవలసలో 150 శాతం మేరకు ఆస్తి పన్ను పెంచారు. అప్పటివరకు రూ.300 చెల్లించే వారికి రూ.1000 వరకు పన్ను పెరిగింది.
- 2015 అక్టోబర్ నెలలో ఆర్టీసీ చార్జీలు పెంచారు.

ఎలా నమ్మాలి బాబూ..



- శ్రీకాకుళం స్మార్ట్ సిటీ చేస్తామని మోసం చేశారు.
- జిల్లా కేంద్రంలో రూ.119కోట్లతో భూగర్భ డ్రైనేజీ, రూ.150 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఒక్క అడుగు ముందుకు వేయలేదు.
- నరసన్నపేటలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. తర్వాత గాలికొదిలేశారు.
- ఉద్దానం కొబ్బరి రైతులు, ఉద్యానవన రైతుల కోసం కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటులో భాగంగా కోకోనట్ ఫుడ్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. వారి ప్రకటన గాలిలో కలిసిపోయిందే తప్ప అమలుకు నోచుకోలేదు.
- సోంపేట, తీర ప్రాంతాల్లో మత్స్యకార పరిశ్రమలు పెడతామని చెప్పారు. కానీ ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయి.
- ఆమదాలవలసలో ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తామని మాట తప్పారు.
- కళింగపట్నం, భావనపాడు రేవులో ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తామన్నారు. కానీ చేతులేత్తేశారు.
- వంశధార ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. సగం పనులు కూడా పూర్తి చేయలేకపోయారు.
- వంశధార, నాగావళి, బాహుదా నదుల అనుసంధానమన్నారు. చేసిందేమీ లేదు గానీ డీపీఆర్ పేరుతో కోట్లు నొక్కేశారు.
- ఆఫ్‌షోర్‌ను పట్టించుకోనేలేదు.
- తోటపల్లి ఆధునికీకరణ పేపర్లకే పరిమితం చేశారు.
- చంద్రన్న బాట రోడ్లు, రైతు రథం, నీరు–చెట్టు, పసుపు కుంకుమ పేర్లు పెట్టి ఆ పార్టీ నాయకులే ప్రజల సొమ్మును దోచుకుతిన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రగతి పనులిలా..



పలాసలో రూ.85 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించారు.

- ఉద్దానం కోసం రూ.700 కోట్లతో వైఎస్సార్ సుజలధార పథకం నిర్మించారు.
- వంశధార రిజర్వాయర్‌ను నింపేందుకు గొట్టా బ్యారేజీ వద్ద రూ.176.35 కోట్ల వ్యయంతో ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు.
- 26 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, పలాస పట్టణానికి తాగునీరు అందించేందుకు మహేంద్ర తనయ వద్ద రూ.852.45కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు చేస్తున్నారు. మడ్డువలస రిజర్వాయర్ రెండో దశ పనులను రూ.26.90 కోట్లతో చేపడుతున్నారు.
- ఆమదాలవలస నియోజకవర్గంలో 12 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు.
- మూలపేట వద్ద రూ.2,949.70కోట్లతో పోర్టు నిర్మిస్తున్నారు.
- సాగర మాల ప్రాజెక్టులో భాగంగా బుడగట్లపాలెం వద్ద రూ. 365.81కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని మంచినీళ్లపేటలో ప్రస్తుతం రూ. 11.95కోట్లతో నిర్మిస్తున్న జెట్టీ స్థానంలోనే ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- జిల్లాలో గత నాలుగేళ్లలో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో రూ.526.69కోట్లతో 432 రోడ్లు నిర్మించింది.
- పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఏఐఐబీ కింద రూ.352.78కోట్లతో 484.43 కిలోమీటర్ల మేర 312 రోడ్లు వేసింది.



- ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూ కింద రూ.70.96 కోట్లతో 94.30 కిలోమీటర్లకు సంబంధించి 23రోడ్లు మంజూరు చేయగా వాటి నిర్మాణం పూర్తి చేశారు.
- జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో రూ.56.35కోట్లతో 102 గ్రామాలకు ఉపయోగపడేలా 42 సీసీ, బీటీ రోడ్లు వేశారు. మరో రూ.300 కోట్లతో జిల్లాలో 12 భారీ వంతెనలు నిర్మించింది.
- బలసలరేవు బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.87 కోట్లు మంజూరు చేశారు.
- సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో బాలికల జూనియర్ కళాశాల, వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేశారు. తొగరాంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేసి, తరగతులు ప్రారంభించారు. బూర్జ మండలం పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ మంజూరు చేశారు.
- జిల్లాలో మొత్తం 835 సచివాలయాలు ఏర్పాటు చేసి 655 పక్కా భవనాలు నిర్మించారు.
- అలాగే 544 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు.
- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించే అద్భుత కార్యక్రమం హెల్త్ క్లినిక్‌ల సేవల్లో భాగంగానే నిర్వహిస్తున్నారు.
- జిల్లాలో రైతుల కోసం 656 రైతుభరోసా కేంద్రాలు నిర్మించారు.
- 564 బల్క్ మిల్క్ సెంటర్లు నిర్మించారు. 117 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేశారు.
- నాడు–నేడు పథకం కింద 83 ఆస్పత్రులను రూ.47కోట్లతో అభివృద్ధి చేశారు.
- నరసన్నపేట ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. మొత్తంగా ఐదు రూరల్ పీహెచ్‌సీలు, 11 అర్బన్ పీహెచ్‌సీలు నిర్మించారు.
- జిల్లాలో లక్షా 10వేల825మందికి ఉచితంగా ఇళ్ల స్థలాలు అందజేశారు. వాటిలో మొదటి విడతగా 83,456ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.
- జిల్లాకు మూడు ఆక్వా హబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసింది. శ్రీకాకుళం, పలాస, పాలకొండకు కేటాయించింది.
- నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో భాగంలో జిల్లాలో 27 ఫిష్ ఆంధ్రా డెలీషియస్ యూనిట్లు ఏర్పాటు చేశారు.
- వంశధార నిర్వాసితులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.216కోట్లు అదనపు పరిహారం అందజేశారు.
- తిత్లీ తుపానులో నష్టపోయిన వారికి ఏకంగా ఒక్కో చెట్టుకు రూ.3000, జీడి తోటలకు హెక్టార్‌కు రూ.50 వేలు మంజూరు చేశారు.

చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీ కుర్చీలు



కార్యకర్తలే కుర్చీలు మడతెట్టేశారు

- చంద్రబాబు ప్రసంగంతో బేజారు
- అబద్ధాలు వినలేక వెళ్లిపోయిన జనం
- 'రా కదలిరా..' సభలో ఆసక్తికర పరిణామాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళంలో జరిగిన టీడీపీ రా కదలిరా సభలో ఆ పార్టీ కార్యకర్తలే కుర్చీలు మడతెట్టేశారు. చంద్రబాబు అబద్ధపు ప్రసంగాలను వినలేక తెలుగు తమ్ముళ్లే విసుగు చెందారు. ఆయన ప్రసంగం మొదలుపెట్టగానే జనాలు వెనుదిరిగారు. దీంతో సభా ప్రాంగణంలో ఖాళీ కుర్చీలే మిగిలాయి.

చంద్రబాబు రాష్ట్ర మంతటా రా కదలిరా సభలు నిర్వహిస్తున్నారు. దాదాపు అన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. శ్రీకాకుళంలో ఆ పరిస్థితి రాకూడదని టిక్కెట్లు ఖరారు చేయకుండా వ్యూహాత్మకంగా సభ పెట్టారు. దాదాపు ఐదు నియోజకవర్గాల్లో ఇద్దరు ముగ్గురేసి అభ్యర్థులు ఆశావహులుండటంతో బల నిరూపణ చేసుకున్న వారికే టిక్కెట్ అని ఆశ చూపించారు. దీంతో సదరు ఆశావహులు మనిషికి రూ.300నుంచి రూ.500వరకు నగదు, మద్యం బాటిల్, భోజనం, రవాణా సదుపాయం కల్పించి జనాలను తీసుకొచ్చారు. కష్టపడి తీసుకొచ్చిన జనాలను చంద్రబాబు నిలబెట్టలేకపోయారు. తన ప్రసంగాలతో బోరు కొట్టించి అక్కడి నుంచి వెళ్లిపోయేలా చేశారు.

మధ్యాహ్నం 3గంటలకు సభ ప్రారంభమవుతుందని ప్రకటించినా ఆ సమయానికి జనాలు రాలేదు. కుర్చీలన్నీ ఖాళీగానే ఉన్నాయి. ఆ తర్వాత జిల్లాలోనే ఎనిమిది నియోజకవర్గాల నుంచే కాకుండా రాజాం, పాలకొండ, చీపురుపల్లి, నెల్లిమర్ల నియోజకవర్గాల నుంచి జనాలు వచ్చారు. 4.30గంటల తర్వాత చంద్రబాబు వచ్చారు. అక్కడి నుంచి సభకు హాజరైన ప్రజలకు పరీక్ష ఎదురైంది. జిల్లాకు ఫలానా చేశానని చెప్పకుండా అన్నీ తనవే అని చెప్పుకోవడం ప్రారంభించారు. అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఏ రకంగానైతే అబద్ధాలు చెప్పుకొచ్చారో వాటినే చంద్రబాబు రిపీట్ చేశారు. దీంతో ప్రజలకు అర్థమైపోయింది. ఫలితంగా సభా ప్రాంగణమంతా ఖాళీ అయిపోయింది. దీంతో ఎంతో కష్టపడి, భారీగా ఖర్చు పెట్టి తీసుకొచ్చిన జనాలను చంద్రబాబు నిలబెట్టలేకపోయారని నాయకులంతా ఉసూరుమన్నారు.

అమృత్ భారత్‌తో స్టేషన్ల అభివృద్ధి

- స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల పథకాన్ని సోమవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఊసవానిపేట వద్ద రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.66.5కోట్లు, స్టేషన్ ఆధునికీకరణకు రూ. 25 కోట్లు, దూసి వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.70కోట్లు, నౌపడ స్టేషన్ అభివృద్ధికి రూ.19కోట్లు, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.18 కోట్లు మంజూరు చేశారు. దీనికి సంబంధించిన పనులకు వర్చువల్‌గా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ ఆవరణలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్పీకర్ పాల్గొని మాట్లాడారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద పలు రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాలు పెంచడం ఆనందదాయకమన్నారు. ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి పలుమార్లు వినతులు అందించామని గుర్తు చేశారు. మోడల్ స్టేషన్‌తో పాటు సూపర్ ఫాస్ట్ రైళ్లకు ప్రత్యేక హాల్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఏడీఈఆర్‌ఎం గుప్తా, స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్ దుంపల శ్యామలరావు జేజే మోహనరావు, జేకే వెంకబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక రైల్వే స్టేషన్‌ని అమృత్ భారత్ స్టేషన్ పథకంలో అభివృద్ధి చేసేందుకు సోమవారం శ్రీకారం చుట్టారు. స్టేషన్ ఆవరణలో స్టేషన్ ఈ కార్యక్రమాన్ని ఈస్ట్‌కోస్టు రైల్వే చీఫ్ ఇంజినీర్ అధికారి (సీఈ) చంద్రమోన్ షక్రి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య, ఈస్ట్‌కోస్ట్ రైల్వే అసిస్టెంట్ ఇంజనీర్ రస్మిరంజాన్ దాస్ పాల్గొన్నారు.

నౌపడలో..

టెక్కలి: టెక్కలి మండలం నౌపడ రైల్వే స్టేషన్‌లో సుమారు రూ.19 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, రైల్వే చీఫ్ ఇంజనీర్ కన్‌స్ట్రక్షన్ రామ్‌సింగ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

దూసిలో..



వీసీలో ప్రధాని నరేంద్ర మోదీ

ఆమదాలవలస రూరల్: దూసి రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక చరిత్ర ఉందని రైల్వే కన్సల్టేటివ్ మెంబర్ (ఎస్‌సీసీ) సనపల నర్సింగరావు అన్నారు. మండలంలో దూసి రైల్వేస్టేషన్ వద్ద నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి నర్సింగరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాగోలు నుంచి తొగరాం వెళ్లే అర్‌అండ్‌బీ రహదారికి అనుకూలంగా రైల్వేగేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే ట్రాఫిక్ సమస్యకు తెరపడుతుందన్నారు.

97 శాతం పనులు పూర్తి



హిరమండలం వంశధార రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, క్వాలిటీ కంట్రోల్ అధికారులు

హిరమండలం: వంశధార ఫేజ్–2 రిజర్వాయర్ పనులు 97 శాతం పూర్తయినట్టు ఎస్ఈ డోల తిరుమలరావు తెలిపారు. రిజర్వాయర్‌ను త్వరలో జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఆయన సోమవారం రిజర్వాయర్ నిర్మాణ పనులను వంశధార ఇంజినీర్ అధికారులతో కలిసి పరిశీలించారు. స్పిల్ వేతో పాటు తులగాం గెడ్డ వద్ద జరుగుతున్న పెండింగ్ పనుల గురించి ఆరా తీశారు. వీటితో పాటు ఎత్తిపోతల పథకం, హైలెవల్ కాలువ అనుసంధాన పనులను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి ఎస్ఈ కీలక సూచనలు ఇచ్చారు. ఎస్ఈ తిరుమలరావు మాట్లాడుతూ దాదాపు రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. అటు కాంట్రాక్టర్‌కు ఎలాంటి బిల్లులు పెండింగ్‌లో లేవని తెలిపారు. ఈ ఖరీఫ్‌నకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రెండు నెలల్లో రిజర్వాయర్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. నేరడి బ్యారేజీలో నెలకొన్న సందిగ్ధతతోనే రూ.176.5 కోట్లతో ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ త్రినాథరావు, డీఈ ప్రభాకరరావు, వంశధార కట్టడాల విభాగం ఈఈ ఎన్వీ రమణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. డీఈలు రవీంద్ర, సురేష్ బాబు, జేఈలు వినయ్, భరత్ రెడ్డి, శ్రీనివాసరావు, సోమ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పందనకు 178 వినతులు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 178 వినతులు అందాయి. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అర్జీలు స్వీకరించారు. వినతులన్నీ నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కేఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, జెడ్పీ సీఈఓ డి.వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టి రాజు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, హౌసింగ్ పీడీ గణపతి రావు, ఇరిగేషన్ ఎస్ఈ డోల తిరుమల రావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



విశాఖపట్నం : అంబులెన్స్ నుంచి విమానాశ్రయంలోకి తరలిస్తున్న గుండె, లివర్

ధర్మారావు చిరంజీవి



ధర్మారావు (ఫైల్)

శ్రీకాకుళం రూరల్: జిల్లాలోని పలాసకు చెందిన కిల్లి ధర్మారావు(28) అవయవదానంతో చిరంజీవిగా నిలిచారు. ఆయన ఈ నెల 24న కంచిలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే స్థానికులు జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఆయనను బ్రెయిన్ డెడ్‌గా గుర్తించారు. అంతబాధలో కూడా ధర్మారావు కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. జీవన్ దాన్ స్వచ్ఛంద సంస్థను సంప్రదించారు. దీంతో జెమ్స్‌లోనే అవయవాలను వేరు చేసి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గుండెను తిరుపతి స్విమ్స్‌కు, ఊపిరితిత్తులను సికింద్రాబాద్ కిమ్స్‌కు, లివర్, ఒక కిడ్నీను వైజాగ్ కిమ్స్‌కు, కళ్లను శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌కు అందజేశారు. కుటుంబ సభ్యులను జెమ్స్ ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది. ఈ వ్యవహామంతా గ్రీన్‌ఛానల్ ద్వారా సాయంత్రం 6 గంటలకు ప్రారంభించినట్లు ఆర్‌ఎంలు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, బాలమురళి తెలిపారు.

పోలీసు స్పందనకు 19 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుని సమస్య వింటున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి అర్జీదారుల నుంచి 19 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ జీఆర్ రాధిక ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు త్వరితగతిన సమస్యలు పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీ బి.విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

28 నుంచి వాసుదేవుని బ్రహ్మోత్సవాలు

- 15వ బ్రహ్మోత్సవాలకు మందసలో ఏర్పాట్లు
- 6వ తేదీ వరకు ఉత్సవాలు

మందస: మందస పట్టణంలోని శ్రీవాసుదేవ పెరుమాళుని 15వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 28 నుంచి మార్చి 6వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. 14వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయంలో రాజుల కాలం నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. రాచరిక పాలన అంతరించడంతో కాలక్రమేణా బ్రహ్మోత్సవాలు నిలిచిపోయాయి. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో 2010వ సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీన బ్రహ్మోత్సవాలు పునః ప్రారంభించారు.

అప్పట్లో వేద పాఠశాల

1744వ సంవత్సరంలో మందస సంస్థానానికి విద్వాంసులుగా నరసాపురానికి చెందిన తెలికిచర్ల కందాడ రామానుజాచార్యస్వామి ఉండేవారు. ఆయన వాసుదేవుని ఆలయంలో స్థానాచార్యులుగా ఉండేవారు. ఆయన వద్ద త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి, గోపాలాచార్య స్వామి శిష్యులుగా ఉండేవారు. వాసుదేవుని ఆలయ ప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలో వీరు వేదం నేర్చుకున్నారు. అప్పట్లో ఇక్కడ బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు ఇరుగు పొరుగు రాజ్యాల నుంచి భక్తులు వచ్చేవారు. రాచరిక పాలన అంతరించిన తర్వాత కొన్ని దశాబ్దాల పాటు ఆలయం మూతబడి, శిథిలావస్థకు చేరుకుంది. ఆఖరకు చిన్న జీయరు స్వామి ఆలయం చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి తన గురువు స్మారకార్థం జీర్ణోద్ధరణ చేసేందుకు సంకల్పించారు. 2000 జూలై 7వ తేదీన చిన్నజీయర్‌స్వామి సారథ్యంలోని మధుభయ వేదాంత ఆచార్య పీఠం దేవదాయశాఖ నుంచి వాసుదేవుని ఆలయంపై సర్వహక్కులు తీసుకుంది. శిథిలావస్థకు చేరిన ఆలయంలో 2001 నుంచి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణానికి సుమారు రూ. 2 కోట్లు వెచ్చించారు. ఒడిశాకు చెందిన శిల్ప కళాకారులను తెప్పించి పూర్వకళాకృతిలో నిర్మాణం జరిపారు. 2009 ఫిబ్రవరి 19వ తేదీన సంప్రదాయబద్ధంగా వేదపండితులతో అంగరంగ వైభవంగా పునఃప్రతిష్ఠించారు. రాజరిక పాలనలో ఉన్న విగ్రహాన్నే యథావిధిగా పునఃప్రతిష్ఠించారు. శ్రీవాసుదేవుని తిరుపతి కొండపై ఉన్న వెంకటేశ్వరస్వామి విగ్రహం మాదిరిగానే నల్లరాతితో వాసుదేవుని నిజరూపం ఉండడం విశేషం. గత ఎనిమిదేళ్లుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు ఈ ప్రాంతీయులే కాకుండా ఇతర జిల్లాల నుంచి, రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారు.



వాసుదేవపెరుమాళ్



శ్రీవాసుదేవస్వామి ఆలయం(ఫైల్)



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీవాసుదేవ ఆలయం

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యే బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాస్‌కూర్మాచార్యులు తెలిపారు. భక్తులకు భోజన ఏర్పాట్లు, మంచినీటి సౌకర్యం, దైవ దర్శనం చేసుకునే సమయంలో తోపులాటలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు.

స్వామి నిత్య కార్యక్రమ వివరాలు

శ్రీత్రిదండి చినశ్రీమన్నారాయణ రామానుజజీయర్‌స్వామి, శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, శ్రీ త్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామిల పర్యవేక్షణలో 15వ బ్రహ్మోత్సవాలు ఏడు రోజుల పాటు మందసలో జరుగనున్నాయి. త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి, త్రిదండి అహోబిలరామానుజ జీయర్ స్వామి, త్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామిల పర్యవేక్షణలో బ్రహ్మోత్సవ వేడుకలు ఏడు రోజుల పాటు మందసలో జరుగనున్నాయి. ప్రతి రోజూ విశేష కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు, సంకీర్తనలు, కోలాటాలు కార్యక్రమాలు జరుగుతాయి.

పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి: డీఈఓ

టెక్కలి: మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సూచించారు. పదో తరగతి పరీక్షల పర్యవేక్షణకు సంబంధించి చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సోమవారం టెక్కలి మండలంలోని ప్రణవి కళాశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లు ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, పరీక్షల విభాగం అధికారులు ఆలీఖాన్, డి.లక్ష్మీనారాయణ, ఎంఈఓలు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు, టెక్కలి డివిజన్ పరిధిలోని 72 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 72 మంది డిపార్టుమెంటల్ అధికారులతో పాటు కుమారస్వామి, చిలుకు కృష్ణారావు డివిజన్ కార్యాలయ అధికారులు కుప్పిలి నగేష్, కుప్పిలి ప్రకాష్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు

పరీక్షల పరిశీలన

పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎఫ్ఏ-4 పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.నాగభూషణం, మండల విద్యాశాఖాధికారులు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రోణంకి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలు శిక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: భూ వివాదాలకు సంబంధించి వేర్వేరు కేసుల్లో ఇద్దరికి సోమవారం న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. హిరమండలం మండలం గులుమూరు పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన తోట నాగరాజుకి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానాను విధించారు. జరిమానా కట్టకుంటే శిక్షను మరో మూడు నెలలు అనుభవించాల్సి ఉంటుందని నాల్గో అదనపు జిల్లా న్యాయస్థానం (ఎస్సీ, ఎస్టీ) కోర్టు న్యాయమూర్తి ఎస్ఎం ఫణికుమార్ తీర్పునిచ్చారు. 2015లో భూమి ఆక్రమణతో పాటు దాడికి సంబంధించి ఈ శిక్ష పడింది. అలాగే హిరమండలం మండలం గులుమూరు గ్రామానికి చెందిన గోర్ల చంద్రయ్యకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. రూ.10వేలు జరిమానా, కట్టకుంటే మరో రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పొలాన్ని ఆక్రమించి కులం పేరిట దూషించినందుకు ఈ శిక్ష పడింది.

చివరి దశకు డిగ్రీ మూడో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మూడో సెమిస్టర్ జవాబు పత్రాల స్పాట్ వాల్యుయేషన్ చివరి దశకు చేరుకుంది. ఆరు కేంద్రాల్లో ఈ మూల్యాంకనం కొనసాగుతుంది. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం రూరల్ లోని గాయత్రి ప్రైవేట్ డిగ్రీ కళాశాల, రాజాంలోని జీసీ ఎస్ఆర్ ప్రైవేట్ డిగ్రీ కళాశాల శిబిరాల్లో మూల్యాంకనం ముగిసింది. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాలలో కొనసాగుతోంది. ఇది ముగియగానే ఫలితాలు విడుదల చేస్తామని ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. రెగ్యులర్‌గా 6922, సప్లిమెంటరీగా 4250 మంది పరీక్ష రాసినట్లు తెలిపారు.

టెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో మూడు కేంద్రాలు
- బరంపురంలో మరో రెండు కేంద్రాలు
- మొత్తం 9090 మంది అభ్యర్థులు

నరసన్నపేట: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో భాగంగా మంగళవారం నుంచి మార్చి 9 వరకూ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 9090 మంది అభ్యర్థులు టెట్ పరీక్ష రాస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో మూడు కేంద్రాలు, బరంపురంలో రెండు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎచ్చెర్ల వద్ద శివానీ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే నరసన్నపేట బైపాస్ రోడ్డులో గొట్టిపల్లి ఫ్లై ఓవరు వద్ద కోర్ టెక్నాలజీస్ కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రానికీ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా ఎంఈఓలను నియమించారు. అలాగే బరంపురంలో కల్లికోట కళాశాల సమీపంలోని డిజిటల్ జోన్, స్మిట్ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. శివానీలో 1700 మంది, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల్లో 1620 మంది, నరసన్నపేట వద్ద కోర్ టెక్నాలజీస్‌లో 4807 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. అలాగే బరంపురంలో డిజిటల్ జోన్‌లో 755 మంది, స్మిట్ డిగ్రీ కళాశాలలో 208 మంది పరీక్షలు రాస్తున్నారు.



నరసన్నపేటలో యాజమాన్య ప్రతినిధులకు సూచనలు చేస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ దాలినాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: టెట్-2024 కోసం పరీక్ష కేంద్రాలకు డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హెల్ప్‌లైన్ కేంద్రంలో ఎం.శ్రీనివాసరావు (ఏడి)- 9703148269, పి.సంతోష్‌కుమార్ (సూపరెండెంట్)- 7989139860, కె.శ్యామలరావు (సీనియర్ అసిస్టెంట్) - 9494094904 నంబర్లను సంప్రదించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

గడ్డి కుప్పలు దగ్ధం

టెక్కలి రూరల్: మండలంలోని సీతాపురం గ్రామంలో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న గడ్డికుప్పలు సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. సీతాపురం గ్రామానికి చెందిన కోనారి నరసయ్య తిర్లంగి గ్రామానికి చెందిన సారిపల్లి అప్పయ్య, లఖినేని నారాయణరావు, మార్పు కామేష్‌లకు చెందిన సుమారు 5గడ్డి కుప్పల నుంచి సోమవారం సాయంత్రం ఒక్కసారి మంటలు రావడం స్థానికులు గుర్తించారు. యజమానులకు సమాచారం అందించే లోపు మంటలు ఎగసిపడ్డాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నికి ఆహుతైన గడ్డిని పశువుల మేత కోసం కొని తెచ్చామని, దాని విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని బాధిత రైతులు వాపోయారు. అయితే పాఠశాల సమీపంలో మంటలు చెలరేగడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.



గడ్డికుప్పల నుంచి చెలరేగుతున్న మంటలు

పట్టపగలే దొంగతనం

కాశీబుగ్గ: పట్టపగలు ఓ ఇంట్లో దొంగలు చొరబడి దోచుకున్న సంఘటన ఆదివారం పలాసలో సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 12వవార్డు పోతనపల్లి వారి వీధిలో ఆదివారం మధ్యాహ్నం దొంగలు పడ్డారు. కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయం వెనుకవీధిలో ఉన్న కొత్తకోట రామ, కొత్తకోట లక్ష్మిప్రణవిలకు చెందిన పదిహేను తులాల బంగారం, మూడు కిలోల వెండి అపహరించినట్లు పోలీసులకు తెలియజేశారు. న్యూకాలనీలో టిఫిన్‌షాప్ నడుపుతున్న కుటుంబ సభ్యులు మధ్యాహ్నం ఓ శుభకార్యానికి వెళ్లారు. దీన్ని అదనుగా తీసుకున్న దొంగలు ఇంటితాళాలు పగలుగొట్టి లోపలకు జొరబడి బంగారం, వెండితో పాటు చిట్‌ఫండ్‌లో పాడిన నగదు సైతం దొంగిలించారని బాధితులు పోలీసులకు తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఇంటికి వచ్చి చూసేసరికి బీరువా పగలు గొట్టి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్‌టీమ్ కూడా ఆధారాలు సేకరించింది. కాశీబుగ్గ పోలీసుస్టేషన్ వెనుకనే సంఘటన జరగడంతో కాశీబుగ్గ సీఐ విజయానంద పూర్తి స్థాయి విచారణ చేపట్టి నిందితుల కోసం గాలిస్తున్నారు.



మంచంపై వెండిబిందెతో పాటు చెల్లా చెదురుగా వస్తువులు

'క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి'

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడలకు పెద్ద పీట వేస్తోందని, క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆకాంక్షించారు. మండలంలో గల పెదవంక- బాతుపురంలో గత మూడు రోజులుగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 28 జట్లు పాల్గొనగా సచిన్ స్పోర్ట్స్ (శ్రీకాకుళం) జట్టు విజేతగా నిలిచింది. యువతరం సేవా సమితి (పూండి) జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ స్థానంలో బాతుపురం, చతుర్థి స్థానంలో కంచిలి జట్లు నిలిచాయి. విజేతలకు షీల్డ్‌లతో పాటు రూ.15 వేలు, రూ. 10 వేలు, రూ.7500, రూ.5 వేల బహుమతులను మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లా వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, స్థానిక సర్పంచ్ బత్తిని సృజన చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిని లక్ష్మినారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తిని రామారావు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు చెల్లూరి తాతారావు, ఇరోతు లక్ష్మణరావు, బత్తిని యోగేశ్వరరావు, యువకులు ఉన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, సర్పంచ్ బత్తిని సృజన

క్లుప్తంగా

ఆకట్టుకున్న డాగ్ షో



డాగ్ షో పోటీలకు విచ్చేసిన వివిధ జాతుల కుక్కలతో యజమానులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో గజజ్యోతి వెటర్నరీ ఫెస్టివల్‌లో భాగంగా వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు డాగ్ షోను సోమవారం ప్రారంభించారు. డాగ్ షోలో గోల్డెన్ రిట్రీవర్, లాబ్రడర్, సెయింట్ బెర్నార్డ్, పోమేరియన్, కేన్ కర్సో, బాక్సర్, బీగెల్, బుల్ మస్తిఫ్, జర్మన్ షెఫర్డ్ వంటి 35 బ్రీడ్ డాగ్స్ పాల్గొనగా వాటిలో ఉత్తమ బ్రీడ్‌డాగ్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. వర్సిటీ వెటర్నరీ స్కూల్, యానిమల్ సైన్సెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్.కె.స్వయిని, డైరక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢి పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఒడిశా కెన్నల్ క్లబ్ అధ్యక్షుడు సుబ్రత్ పృష్టి, వెటర్నరీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఎం.జీ.జయంత్ నాగరాజ్, ఫార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.బిమల్ కుమార్ చౌదరి వ్యవహరించారు.

బ్రాహ్మణుడికి ఇంటి స్థలం విరాళం



పత్రాలను అందిస్తున్న దృశ్యం

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన నిరుపేద బ్రాహ్మణుడు అనిల్ పాణిగ్రహికి సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు ఇంటి స్థలాన్ని విరాళంగా అందజేశారు. సోంపేట పట్టణంలోని రోటరీ క్లబ్ ఆవరణలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ పాణిగ్రాహికి ఇంటి స్థలాన్ని అందజేసి రిజిస్ట్రేషన్ చేయించారు.